క్లుప్తంగా

4 నుంచి మద్భాగవత ప్రవచనాలు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలోని ఏఎంజీ ఎదురుగా గాయత్రీ నగర్‌లో ఉన్న సీతారామాలయంలో ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామిచే మద్భాగవత ప్రవచనాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి ఏడు గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ మేరకు అహోబల రామానుజ జీయర్ స్వామి గోష్ఠి, బొమ్మూరు వికాస తరంగణి సభ్యులు ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ రూపొందించిన పారా లీగల్ వలంటీర్స్ పథకం కింద వలంటీర్లుగా ఏడాది కాలం పనిచేసేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. 18 ఏళ్లు నిండి, మెట్రిక్యులేషన్ / సరి సమానమైన అర్హత ఉండాలన్నారు. డిసెంబర్ 21వ తేదీ వరకూ దరఖాస్తులు అందజేయవచ్చన్నారు.

అగస్త్యేశ్వరునికి అన్నాభిషేకం


ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి

ధవళేశ్వరం: గ్రామంలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు శంకరమంచి విశ్వనాథ శర్మ(విస్సు), మంగళంపల్లి చంద్రశేఖరశాస్త్రి పాల్గొన్నారు.

అన్న సమారాధన

సీటీఆర్ఐ: కార్తిక మాసంలో చివరి రోజు సందర్భంగా ఆదివారం స్థానిక కోటిలింగాలఘాట్ వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఈ క్షేత్ర పురోహితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 5 వేల మంది తరలి వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, తోట సుబ్బారావు హాజరయ్యారు.
రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని గౌరీచంద్ర మాహేశ్వర ఆలయంలో ఆదివారం కార్తిక అన్న సమారాధనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

చిన్నారులకు దుప్పట్ల పంపిణీ


చిన్నారులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న చల్లా శంకరరావు

రాజమహేంద్రవరం సిటీ: బాలికా సదనం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు అన్నారు. బాలికా సదనంలో ఆదివారం ఆయన పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యాయవాది నూకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, బాలికా సదనం సూపరింటెండెంట్ రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

కృపారావుకు అచీవ్‌మెంట్ సర్టిఫికెట్


సర్టిఫికెట్ అందుకుంటున్న కృపారావు

సీటీఆర్ఐ: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు చేస్తున్న సేవలకు గాను కోనసీమ సేవామండలి అధినేత ఎస్పీ కృపారావు అచీవ్‌మెంట్ సర్టిఫికెట్ అందుకున్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే నిర్వహించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృపారావు మాట్లాడుతూ కోనసీమ సేవా మండలి కేర్, సపోర్ట్ సెంటర్ 2.0 ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు సేవలు చేస్తున్నామన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

కంబాలచెరువు: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5.15 లక్షలకు టోకరా వేసిన సంఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బొగ్గులదిబ్బకు చెందిన ఆర్.కిశోర్ కుమార్‌కు టి.నగర్‌కు చెందిన సాయి దిలీప్‌తో పరిచయముంది. ఈ నేపథ్యంలో కిశోర్ కుమార్‌కు ఉద్యోగం విషయంలో సహాయం చేస్తానని చెప్పి సాయి దిలీప్ తెలిపాడు. ఈ క్రమంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం ఉందని చెప్పి రూ.5.15 లక్షలు తీసుకున్నాడు. కానీ కాలం గడుస్తున్నా ఉద్యోగం రాలేదు. కొద్ది రోజుల క్రితం సాయి దిలీప్‌కు ఫోన్ చేస్తే అతని ఫోన్ స్విచాఫ్ వచ్చింది. దీంతో కిశోర్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్పొరేషన్‌కు కొత్త ఇంధనం

- వ్యాపార రంగంలోకి నగరపాలక సంస్థ
- క్వారీ సెంటర్‌లో పెట్రోల్ బంకు ఏర్పాటు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం ప్రారంభోత్సవం


క్వారీ సెంటర్‌లో సిద్ధమైన నగరపాలక సంస్థ పెట్రోల్ బంక్

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజలకు సేవలు అందించే కార్పొరేషన్ ప్రత్యక్ష వ్యాపార రంగంలోకి అడుగుపెట్టబోతోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో క్వారీ ఏరియాలో పెట్రోల్, డీజిల్ బంక్ నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. దానికి అవసరమైన ఏర్పాట్లను కూడా సిద్ధం చేసుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత బంక్ ప్రారంభోత్సవానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఆదివారం బంక్‌లో ట్రయల్ రన్ నిర్వహించారు.

త్వరలో అందుబాటులోకి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం కొత్త బంకు నగర ప్రజలకు అందుబాటులోకి రానుంది. నగరంలో ప్రజల రద్దీ ఉండే ప్రాంతాలలో క్వారీ సెంటర్ ఒకటి. ఈ ప్రాంతంలో సుమారు 1200 గజాల స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఆ స్థలాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు అందజేయడంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఈ బంక్‌లో మూడు ఫ్యూయల్ ఫిల్లింగ్ పంపులను ఏర్పాటు చేశారు. వీటిలో రెండు డీజిల్‌కు, ఒకటి పెట్రోల్‌కు కేటాయించారు.

కార్పొరేషన్‌కు 80 వాహనాలు

కార్పొరేషన్ ఆధ్వర్యంలో తిరిగే వాహనాలకు ఇప్పటి వరకూ వేర్వేరు బంక్‌లలో ఇంధనాన్ని నింపుకొంటున్నారు. కొత్త బంక్ ప్రారంభోత్సవం అనంతరం ఇక్కడే ఆ వాహనాలకు పెట్రోల్, డీజిల్ కొట్టించుకుంటారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు 80 వాహనాలు పని చేస్తున్నాయి. వీటి ఇంధనానికి నెలకు సుమారు రూ.15 లక్షలు ఖర్చవుతున్నాయి.

కమీషన్‌తో పాటు ఆదాయం

కార్పొరేషన్ బంక్‌లో ఆ సంస్థ వాహనాలకు డీజిల్ కొట్టించుకోవడం వల్ల కమీషన్ రూపంలో ఆదాయం వస్తుంది. అలాగే బయట వాహనాలకు విక్రయాలు చేయడం ద్వారా కూడా ఆదాయం సమకూరుతుంది. అలాగే మరిన్ని ఖాళీ స్థలాలలో నగరపాలక సంస్థ, ప్రైవేటు యాజమాన్యంలో వ్యాపారాలు నిర్వహించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ విభాగం వ్యాపార సంస్థల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించే ప్రయత్నం చేపట్టింది.

వెసులుబాటు



క్వారీ ప్రాంత ప్రజలకు పెట్రోల్, డీజిల్ బంక్ అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకూ ఇంధనం కోసం శానిటోరియం వరకూ వెళ్లాల్సి వచ్చేది. మాకు దగ్గరలో బంకు రావడం వల్ల వెసులుబాటు కలుగుతుంది. అలాగే స్థానిక మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.
– వరకృష్ణ, క్వారీ ఏరియా, రాజమహేంద్రవరం

నాణ్యమైన ఇంధనం



నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ద్వారా నాణ్యమైన ఇంధనం అందుతుంది. క్వారీ ప్రాంత ప్రజలందరికీ బంక్ దగ్గరగా ఉంటుంది. పెట్రోల్ కోసం దూరంగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. బంక్ ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తున్నాం.
– పాశా సూర్యచంద్రబాబు, క్వారీ ఏరియా, రాజమహేంద్రవరం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపీమూర్తిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కంబాలచెరువు: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏపీటీఎఫ్ (1938) శాఖ పిలుపు నిచ్చింది. స్థానిక నెహ్రూ నగర్ మున్సిపల్ పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న గోపీమూర్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే మన సమస్యలను చట్టసభల్లో వినిపిస్తారన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఉదయ బ్రహ్మం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు వఝల అప్పయ్య శాస్త్రి మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు టీచర్ ఎమ్మెల్సీగా స్థానం లేదని, పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డేవిడ్ లివింగ్ స్టన్, నగర శాఖ అధ్యక్షులు జి.తాతారావు, ప్రధాన కార్యదర్శి ఎన్‌జీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి


రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డీన్ శ్రీనివాస్, నక్కా రాజబాబు

రాజమహేంద్రవరం రూరల్: కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా మూడో రోజు ఆదివారం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రాజవోలులో ఆరోగ్య, రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ శ్రీనివాస్ మాట్లాడుతూ చెత్త నియంత్రణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని, అప్పుడే గ్రామాలు, పట్టణాలు కాలుష్య రహితంగా ఉంటాయన్నారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సీహెచ్ సునీత, డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాజవోలులో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వీధుల్లో చెత్తను శుభ్రం చేశారు. ముందుగా వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. కో ఆపరేటివ్ బ్లడ్ డోనర్లు, వలంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏ.సుధాకర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు రక్తదానం చేశారు. రక్తదాతలను అసోసియేట్ డీన్ డాక్టర్ జి.శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు అభినందించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈఎస్ ఉజ్వల రాణి, అగ్రికల్చర్ స్టాటిస్టిక్ టీచింగ్ అసోసియేట్ డి.చిన్ని పాల్గొన్నారు.

కాపు సంఘీయుల సంక్షేమానికి కృషి

- మంత్రి కందుల దుర్గేష్
- ఉత్సాహంగా వన సమారాధన


కాపు సంక్షేమ సంఘం వన సమారాధనలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్: కాపుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నగర కాపు సంక్షేమ, సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు రామినీడి మురళి అధ్యక్షతన చెరుకూరి గార్డెన్స్‌లో ఆదివారం కాపుల కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గేష్ మాట్లాడుతూ సామాజిక వర్గీయులకు ఏ సమస్య వచ్చినా తన పరిధిలో పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటానన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భార్య వెంకటలక్ష్మి మాట్లాడుతూ వన సమారాధన నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ సంఘం ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజికవేత్త ఏఏఎస్ చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు రామినీడి మురళి, గౌరవ సలహాదారు, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కాపు సంఘం సీనియర్ నాయకులు అర్లపల్లి నాగబోస్, డాక్టర్ పంతం అచ్యుత రామారావులను సంఘం తరపున సత్కరించారు. అలాగే ముఖ్యఅతిథులు, సంఘ పెద్దలకు జ్ఞాపికలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వైభవంగా కార్తిక వనసమారాధన

కడియం: మండలంలోని దుళ్ల కాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధన వైభవంగా జరిగింది. సంఘీయులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ముందుగా ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ యర్రా వేణుగోపాల రాయుడు, వివిధ పార్టీల నాయకులు రావిపాటి రామచంద్రరావు, గిరజాల వీర్రాజు, సంగిత సూరిబాబు, తాడాల విష్ణుచక్రవర్తి, రావిపాటి రామకృష్ణ, బత్తుల రాము, వెలుగుబంటి రఘురామ్ తదితరులు హాజరయ్యారు.

14న ఉద్యోగుల మహాసభ


సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌వర్మ

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించే దిశగా జిల్లా స్థాయిలో వేలాది మందితో ఈ నెల 14వ తేదీన రాజమహేంద్రవరంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం బొమ్మూరులో జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్‌వర్మ మాట్లాడుతూ తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు, గెజిటెడ్ కేడర్ వరకూ వారి సమస్యలు తెలుసుకున్నామన్నారు. జిల్లాలో సుమారు 10 వేల మంది ఉద్యోగులను తమ సంఘ నాయకులు కలిశారన్నారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ సీహెచ్ఎస్ విల్సన్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన రాజమహేంద్రవరంలోని జేకే గార్డెన్స్ కల్యాణ మండపంలో రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన మహాసభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ కోశాధికారి కాకర్ల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విజయ కుమార్, బి.నాగేశ్వరరావు, జిల్లా నాయకులు షరీఫ్, చాంబర్లీన్, దినేష్, రమేష్, ద్విభాష్యం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరమశివునికి రుద్రహోమం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సీటీఆర్ఐ: కార్తిక మాసం చివరి రోజు కావడంతో ఆదివారం స్థానిక గోదావరి గట్టున గల ఉమా మార్కండేయేశ్వరస్వామివారి ఆలయంలో పరమ శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. పెద్దింటి నీలకంఠ శర్మ ఆధ్వర్యంలో రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం


ఎయిడ్స్ డే సందర్భంగా మొక్క నాటుతున్న ఆర్ఐవో నర్సింహం

కంబాలచెరువు: ఎయిడ్స్‌పై యువత అవగాహన పెంచుకోవాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్ఎల్‌వీ నరసింహం అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ, జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐవో నరసింహం మాట్లాడుతూ వ్యాధి భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నోడల్ ఆఫీసర్, గ్రంథాలయశాస్త్ర అధ్యాపకుడు బోను రామకృష్ణ మాట్లాడారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ భవన ఆవరణలో మొక్కలు నాటారు.

- అప్రమత్తతతో ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చని రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ బి.విజయ కుమారి అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించుకోవాలన్నారు. ఎస్‌కేవీటీ పరిసర ప్రాంతాల్లో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.
- ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్లు డాక్టర్ పి.శ్రీనివాసులు, ఎస్‌కేఎస్ రెహమాన్ ప్రారంభించారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ నుంచి తిలక్ రోడ్డు మీదుగా వీఎల్ పురం వరకు ర్యాలీ చేశారు. విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బి.రమాదేవి, కె.మహేశ్వరి, పోలుకొండ సాయి పాల్గొన్నారు.

కళలు, కళాకారులతో సంస్కృతికి జీవం


గాత్రకచేరీ చేస్తున్న తులసీ విశ్వనాథ్


నృత్యం చేస్తున్న కళాకారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కళలు, కళాకారులు సంస్కృతికి జీవం పోస్తారని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ అండ్ సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో కృష్ణవేణి సంగీత నీరాజనం (ఇన్ క్రెడిబుల్ ఇండియా) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన జేసీ మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు రాజమహేంద్రవరం నిలయమన్నారు. రాష్ట్రంలోని అరసవల్లి, రాజమహేంద్రవరం, మంగళగిరి, తిరుపతి, అహోబిలంలో ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబరు 6, 7, 8 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కృష్ణవేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం రాజమహేంద్రవరంలో నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విదుషి తులసీ విశ్వనాథ్ గాత్ర కచేరీ ఎంతో ఆకట్టుకుంది. ముందుగా విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో సాంస్కతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, టూరిజం ప్రాంతీయ సంచాలకులు వెంకటాచలం, విజయ శంకర ప్రభుత్వ సంగీతం నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి, ఎన్. శ్రీనివాసరావు, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

క్రిస్మస్ వెలుగులు


బొమ్మూరు వెంకటగిరికొండపై ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్లు

రాజమహేంద్రవరం రూరల్: క్రిస్మస్ నెల సందర్భంగా ఆదివారం రాత్రి బొమ్మూరు వెంకటగిరికొండపై యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. వీధి మొత్తం స్టార్లతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా పాస్టర్ జోసఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేసి స్టార్లను ప్రారంచారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల కథల పోటీలు


బాల రచయితలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రకాశం నగర్: బాల మందిరం, గోదావరి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం బాలల కథలు, రచనల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 200 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 4 నుంచి 10వ తరగతి వరకూ చదివే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి చిన్నారులు పాల్గొన్నారు. పోటీ ప్రారంభానికి ముందు కథా రచనపై కార్యశాల (వర్క్ షాప్) నిర్వహించారు. బాల మందిరం అధ్యక్షుడు అంగర గోపాలకృష్ణ మాట్లాడుతూ కథల వల్ల ప్రయోజనాలు, వాటిని ఎలా రాయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోదావరి బాలోత్సవం కార్యనిర్వాహక కార్యదర్శి పి.తులసి మాట్లాడుతూ ఈ పోటీలో విద్యార్థులు రాసిన కథలలో 80 ఎంపిక చేసి, బాలల కథా సంపుటిగా త్వరలో పిల్లల పేరుతోనే ఒక పుస్తకం ప్రచురిస్తామన్నారు. ఉత్తమ బాల రచయితలను ఆ పుస్తకావిష్కరణ సభలో సత్కరిస్తామని తెలిపారు. అనంతరం కథా రచన పోటీలో పాల్గొన్న బాలలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బాల మందిరం కార్యవర్గ సభ్యులు అనంత పద్మనాభాచార్యులు, సీహెచ్ శేష కుమారి, గోదావరి బాలోత్సవం కార్యదర్శి సాయి బాబా పాల్గొన్నారు.

పోలమాంబ కుంచమాంబ జాతర ప్రారంభం


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: వడ్డి పోలమాంబ కుంచమాంబ 108వ రెల్లికుల జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర కమిటీ అధ్యక్షుడు అల్లం పోలయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. 2024 జనవరి 7వ తేదీ వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం దారుల కట్టుట, నీళ్ల బావుట నిర్వహిస్తారు. 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపాలు ఉత్సవం జరుగుతుంది. 14న సత్తెమ్మ తల్లి పిడతల ఉత్సవాలు, 15న మరిడమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 16వ తేదీ అమ్మవార్లకు రంగులు వేసేందుకు తీసుకవెళతారు. 18న పూల ఘట్టం, 19న చల్ల ఘట్టం, 23న రంగులు వేసిన అమ్మవార్లను ఆలయంలోకి తీసుకువస్తారు. జనవరి 1న దుర్గాలమ్మ బావుటా, 6న బాణాసంచా కాల్పులు, తొలి ఏళ్ల రాత్రి, అమ్మవార్ల ఊయల సేవ నిర్వహిస్తారు. జనవరి 7వ తేదీన ముగింపు సందర్భంగా అమ్మవార్ల అనుపు జరుగుతుంది. ఈ జాతరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు లక్షమందికి పైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారని అంచనా.

రాఘవరావుకు పాత్రికేయ మిత్ర బిరుదు ప్రదానం


రాఘవరావును సత్కరిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, జిత్‌మోహన్‌మిత్ర

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్ మిత్ర కళా వేదికపై జిత్ మోహన్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సీనియర్ పాత్రికేయుడు బీవీ రాఘవరావుకు పాత్రికేయ మిత్ర బిరుదుతో సత్కరించారు. అనంతరం సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్ మాట్లాడుతూ రాఘవరావు పాత్రికేయ రంగంలో ఉన్నత విలువలతో పనిచేశారన్నారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న సమాజ సేవకులు నిమ్మలపూడి గోవింద్, కళారత్న పీవీఎస్ కృష్ణారావు, వి.జగపతి, అల్లు బాబీ, ఏఎస్ ఆనంద్ తదితరులు మాట్లాడారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే అనారోగ్యాలు


సమావేశంలో మాట్లాడుతున్న పెండ్యాల కామరాజు

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నాయకుడు పెండ్యాల కామరాజు ఆరోపించారు. నగరంలో ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం, పరిసర ప్రాంతాల్లో ప్రమాదకర రసాయనాలను ఆహార ప్రదార్థాల్లో కలిపి విక్రయాలు జరుగుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కొన్ని హోటళ్లపై అప్పుడప్పుడూ మొక్కుబడిగా దాడులు చేస్తున్నారని విమర్శించారు. కొన్ని మాల్స్‌లో కూరగాయలు, మాంసాన్ని నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. నగరంలో పారిశుధ్యం అడగంటిపోతోందన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల మురుగును, కొన్ని విషపూరిత రసాయనాలను, వ్యర్థాలను నేరుగా పెద్ద డ్రైనేజీలు, గోదావరిలో కలిపేస్తున్నారన్నారు. నగర పాలక సంస్థలో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖల పనితీరు అవినీతి కూపంలో మునిపోయిందని ఆరోపించారు.